

ఐనోమ్ వ్యాలీలో 'యామ్జెన్' పరిశోధన కేంద్రం

5

అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -68 బుధవారం 12 ఆగస్టు 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# అంతర్జాతీయ దృష్టి ఆకర్శించేలా సమ్మిట్

## డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'..

**అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించాలని సీఎంఆదేశం**

**గతేడాది సాధించిన పురోగతిపై నివేదిక కోరిన సీఎం**

**వ్యాపార ప్రముఖులను సదస్సులో సత్కరించేలా ప్రణాళిక**

**హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 పనులపైనా సీఎం సమీక్ష**

**రద్దీకి అనుగుణంగా కోచ్‌లు సమకూర్చుకోవాలని ఆదేశం**

**హైదరాబాద్ ఆగస్టు 11(జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణకు భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా డిసెంబరులో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. సదస్సును అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గత ఏడాది సదస్సు ద్వారా వచ్చిన పెట్టుబడులు, సాధించిన పురోగతిపై సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు.గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సీఎం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

మిగతా 2లో.






# పార్లమెంట్ బయట పోటాపోటీ నిరసనలు..

**అమిత్ షా వివరణకు ప్రతిపక్షం పట్టు**

**మకర ద్వారం వద్ద ఎన్‌డీయే, విపక్షం నిరసనలు**

**ఝార్ఖండ్ అంశంపై విపక్షాన్ని ఎన్‌డీయే నిలదీత**

**అమిత్ షా సభకు రావాలని విపక్షాల డిమాండ్**

**రాహుల్ గాంధీది ద్వంద్వ వైఖరి అంటూ బీజేపీ ఆరోపణలు**

**ఢిల్లీలో పోలీసు చర్యపై షా వివరణకు విపక్షాల పట్టు**

**ఇరు వర్గాలు వెనక్కి తగ్గకపోవడంతో ప్రతిష్టంభన**

**న్యూఢిల్లీ,ఆగస్టు 11(జర్నలిస్ట్ వార్త);**
పార్లమెంట్ మకర ద్వారం వద్ద అధికార, ప్రతిపక్ష ఎంపీలు పోటాపోటీగా నిరసనలు చేపట్టారు. ఝార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళనపై విపక్షం ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోందని ఎన్‌డీయే ఆరోపించింది.

మిగతా 2లో.




# 73 లక్షల ఓట్లు పోయినట్టే

**తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి..**

**తెలంగాణలో 3.38 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్టు ప్రాథమిక అంచనా**

**ఇప్పటి వరకు 2.64 కోట్ల ఎస్ఐఆర్ ఫామ్ ల డిజిటలైజేషన్ పూర్తి**

**జాడ తెలియని ఓటర్ల సంఖ్య 11.25 లక్షలు**



**హైదరాబాద్ ఆగస్టు 11(జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణ వ్యాప్తంగా ఎంతో ఆసక్తి రేపిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణఎన్యూమరేషన్ ప్రక్రియ ముగిసింది. ఈ భారీ సవరణ ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలో మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల అధికారులు ప్రాథమికంగా లెక్క తేల్చారు. సేకరించిన

మిగతా 2లో.

## జనగణమన తరహాలో వందేమాతరం చట్టపరమైన రక్షణ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం



2లో.

# త్వరలో రూ.10, రూ.20 ప్లాస్టిక్ నోట్లు..

## ఫీల్డ్ ట్రయల్స్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

**రూ.10, రూ.20 పాలిమర్ నోట్ల క్షేత్రస్థాయి ప్రయోగాలకు కేంద్రం ఆమోదం**

**ప్రయోగాత్మకంగా వంద కోట్ల చొప్పున నోట్లను జారీ చేయనున్న ఆర్‌బీఐ**

**ప్రస్తుతం ఉన్న కాగితపు నోట్లతో పాటే ఇవి కూడా చెలామణి**

**కాగితపు నోట్ల కంటే ఎక్కువ కాలం మన్నడమే పాలిమర్ నోట్ల ప్రత్యేకత**

**జారీకి పట్టే సమయం, ఖర్చుపై ఇంకా స్పష్టత లేదని వెల్లడి**



2లో.

# సీఎం సోదరులు షెల్ కంపెనీలతో లబ్ధి

**త్వరలోనే బండారం బయటపెడతాం**

**సిఎం సోదరులంతా పెద్దపెద్ద కంపెనీ ఓనర్లు: కెటిఆర్**

**హైదరాబాద్,ఆగస్టు 11(జర్నలిస్ట్ వార్త);**
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరులంతా పెద్ద పెద్ద కంపెనీలకు యజమానులవుతున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక్క ఉద్యోగి కూడా లేకుండా కొత్తకొత్త కంపెనీలు ఏర్పాటుచేస్తున్నారని విమర్శించారు.సీఎం సోదరులు చిన్నచిన్న ఇంటి అడ్రస్‌లతో పెద్దపెద్ద కంపెనీలు రిజిస్ట్రేషన్ చేయించారు. అలాంటి ఊరుపేరు లేని కంపెనీలకు రాష్ట్రప్రభుత్వం రూ.200 కోట్ల విలువైన 5 ఎకరాల భూమి కేటాయించింది. అనుముల కొండల్‌రెడ్డి టెసరాక్ కంపెనీ ఛైర్మన్ అని లింక్‌డిన్ ప్రొఫైల్‌లో

మిగతా 2లో.




# ఏపీలో సోషల్ మీడియా కార్యకర్తలకు కూటమి పార్టీల హెచ్చరిక

**మిత్రపక్ష నేతలను విమర్శిస్తున్న ఫేక్ అకౌంట్లపై కూటమి దృష్టి**

**వ్యక్తిగత దూషణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టీకరణ**

**సంయమనం పాటిస్తూ.. ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలని సూచన**



**అమరావతిఆగస్టు 11(జర్నలిస్ట్ వార్త);**
ఆంధ్రప్రదేశ్‌లోని అధికార ఎన్డీఏ కూటమి భాగస్వామ్య పక్షాలైన తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీలు తమ సోషల్ మీడియా కార్యకర్తలకు, అభిమానులకు కీలక ఆదేశాలు జారీ చేశాయి. మిత్రపక్షాల నాయకులను గానీ, వారి కుటుంబ సభ్యులను గానీ లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత దూషణలకు, విద్వేషపూరిత ప్రచారాలకు పాల్పడితే కఠిన చర్యలు

మిగతా 2లో.

## నిషేధిత భూములపై ప్రజలు

# ఆందోళన చెందొద్దు

**చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం**

**యుద్ధ ప్రాతిపదికన దరఖాస్తులను పరిష్కరించాలి**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**హైదరాబాద్,ఆగస్టు 11(జర్నలిస్ట్ వార్త);**
నిషేధిత ఆస్తుల పిఓబి / 22ఎ జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, చట్టబద్దంగా అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. కొత్తగా ఎలాంటి భూములను తమ ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చలేదని,
గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న

మిగతా 2లో.

# ఘోర రోడ్డు ప్రమాదం

**సంగారెడ్డి జిల్లాలో ఆటోను ట్యాంకర్ ఢీకొన్న ఘటనలో ఏడుగురు మృతి**

**మరో ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం**

**సంగారెడ్డి ఆగస్టు 11(జర్నలిస్ట్ వార్త);**
సంగారెడ్డి జిల్లాలో రెండు ఘోర రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 9మంది దుర్మరణం చెందారు. ఈ రెండు వేర్వేరు ప్రమాదాలు జిల్లాలో జరగడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. జహీరాబాద్ మండలం సత్వార్ వద్ద ఆటోను ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం పాలవగా..

మిగతా 2లో.



# 3.43 కోట్ల మందికి 'స్మార్ట్' ఆహార భద్రత

**ఆగస్టు 15న సంగారెడ్డి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**

**33 జిల్లాల్లో ఏకకాలంలో కార్యక్రమాలు**


**1.06 కోట్ల కార్డులు.. ప్రతి లబ్దిదారుడికి నెలకు 6 కిలోల ఉచిత సన్నబియ్యం**

**2025 జనవరి 26 నుంచి కొత్తగా 16.32 లక్షల ఆహార భద్రత కార్డులు**

**ఏర్పాట్లలో ఎక్కడా లోటు ఉండొద్దు**

**: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

2లో.



# సీఎం సోదరులు షెల్ కంపెనీలతో లబ్ధి

**మొదటిపేజీ తరువాయి**

పెట్టుకున్నారు. సీఎం మరో సోదరుడు జగదీశ్‌రెడ్డి కాంట్రాక్టులు చేసుకుంటున్నారు. సీఎం బామ్మర్ది సృజన్‌రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్టు ఇచ్చారని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ షెల్ కంపెనీల బాగోతాన్ని బయటపెడతామని హెచ్చరించారు. మంగళవారంతెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. అనుముల కొండల్‌రెడ్డి టెర్రాక్ట్ సంస్థకు చైర్మన్‌గా ఉన్నానని ఆయనే చెప్పారని అన్నారు. రేవంత్ బ్రదర్స్ సూటు బూట్లతో కంపెనీలు ఎలా పెట్టారని ప్రశ్నించారు. టెర్రాక్ట్ కంపెనీలో ఒక్క ఎంప్లాయీ కూడా లేరని.. లక్ష రూపాయలతో ఆ కంపెనీ పెట్టడం ఎలా సాధ్యమని నిలదీశారు. ఆ కంపెనీకి వేల కోట్ల భూములు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. రూ.2వేల కోట్ల విలువ చేసే స్థలాన్ని రూ.7 వేల కోట్లకు కేటాయించారని ప్రస్తావించారు. ఆ కంపెనీకి కొండల్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు ఎలా చెబుతారని నిలదీశారు. శ్రీధర్‌బాబుకి తన శాఖలో ఏం జరుగుతుందో తెలియదా.? లేక సీఎం వత్తిడికి తలొగ్గరా అని ప్రశ్నల వర్షం కురిపించారు. కర్ణాటకలో అక్కడి ప్రభుత్వం సీఎం భార్యకు మూడెఎకరాలు కేటాయించడంపై కేసు నమోదైందని తెలిపారు. ముడా స్కాంలో సిద్ధరామయ్య రాజీనామా చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. అనుముల కొండల రెడ్డి టెర్రాక్ట్ సంస్థ కి చైర్మన్‌గా ఆయనే పేర్కొన్నారు. కొండల్‌రెడ్డికి సంబంధం లేకుంటే యూఎస్ కౌన్సిల్ మీటింగ్‌కి ఎలా వెళ్లారని నిలదీశారు. ఈ భూ కేటాయింపులను వదలబోమని వార్నింగ్ ఇచ్చారు. తిరుపతిరెడ్డి ఏ హోదాలో అధికారిక సమావేశాలకు వెళ్తారని ప్రశ్నించారు. ప్రజలకు పట్టాలు ఏ హోదాలో ఇస్తారని నిలదీశారు. రాష్ట్ర గవర్నర్‌నీ కలిసి ఈ విషయంపై విచారణ జరపాలని కోరతామని అన్నారు. 74 లక్షల ఓట్లు తొలగిస్తారనేది ఆందోళనకరమైన విషయమని చెప్పుకొచ్చారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల తర్వాత పార్టీ నేతలు న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అర్హుల ఓట్లు కోల్పోకుండా చూస్తామని అన్నారు. తెలంగాణకు అన్యాయం చేసే జీఆర్ఎంబీ మీటింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం వెళ్తుందా లేదా స్పష్టం చేయాలన్నారు. జలసౌదాలో జరిగే జీఆర్ఎంబీ అజెండా మార్చుకుంటే జలసౌధను ముట్టడిస్తామని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కి జాతీయ హోదా ఇవ్వలేమని కేంద్ర చెప్పినా బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. వరుణ యాగం చేయడం తప్పు కాదు కానీ ప్రభుత్వం చేయాల్సిన పని చేయాలని కేటీఆర్ పేర్కొన్నారు.

# నిషేధిత భూములపై ప్రజలు ఆందోళన చెందొద్దు

**మొదటిపేజీ తరువాయి**

చట్టపరమైన సాంకేతిక చిక్కులను పరిష్కరించి బాధితులకు ఊరట కలిగిస్తామని స్పష్టం చేశారు. భూముల రెగ్యులరైజ్‌కు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు జారీ చేసిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ ప్రొసీడింగ్స్, లే-అవుట్ల అనుమతులు తదితర వివరాలతో కూడిన అన్ని డాక్యుమెంట్లను ఈనెల 14వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. తద్వారా ఫోర్జరీ డాక్యుమెంట్లకు చెక్ పెట్టవచ్చని రిజిస్ట్రేషన్ సమయంలో సబ్ రిజిస్ట్రార్‌లకు స్పష్టత వస్తుందని, ఏది బోగస్ డాక్యుమెంట్, ఏది నిజమైన డాక్యుమెంట్ అనేదానిపై సూపర్ చెక్ చేసుకోవడానికి వీలుకలుగుతుందన్నారు. మరింత పారదర్శకత కోసం పహానీలు కూడా సబ్ రిజిస్ట్రార్‌కు ఆక్సెస్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో ఏది నిజమో కాదో అన్నది యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సూచనలకు అనుగుణంగా ప్రజా కోణంలో ఆలోచించి కలెక్టర్లు నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. ఈ విషయంలో కలెక్టర్లు మరింత క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. మంగళవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలోహైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి కలెక్టర్లు, జిల్లా సబ్‌రిజిస్ట్రార్లతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు.

22ఎకు సంబంధించి ప్రజావాణితో పాటు కలెక్టర్లు,



ఆర్డీవోలు, తహశీల్దార్లకు, సబ్ రిజిస్ట్రార్లకు జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులు ఎన్ని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో కూలంకషంగా చర్చించారు. సమస్య వచ్చినపుడు పరిష్కరించేదానికన్నా సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందన్నారు. పిఓబి దరఖాస్తులకు సంబంధించి కేస్‌బై కేస్ ప్రతి రోజూ సమీక్షించాలి. 22ఎ పేరిట ఉద్దేశపూర్వకంగా పేదోడికి అర్హులకు అన్యాయం చేసే విధంగా వ్యవహరిస్తే ఊరుకునేదిలేదు.

సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలు ఉండకూడదని అదనపు అధికారాలు వద్దని ఈ విషయంపై గతంలోనే చాలా స్పష్టత ఇచ్చాను. ఆన్‌లైన్‌లో ఏది ఉంటే దానికి ఆమోదం తెలిపేవరకే వారి అధికారాలను పరిమితం చేయాలని అధికారులను ఆదేశిస్తున్నాను. ప్రభుత్వ ఆస్తులను కాపాడే విషయంలో ఏమాత్రం రాజీపడే ప్రసక్తేలేదు. ఏ చిన్న తప్పుచేసినా క్షమించేదిలేదు, కఠిన చర్యలు తీసుకుంటానని అన్నారు. ఏదైనా సమస్య ఉంటే జిల్లా సబ్ రిజిస్ట్రార్‌లు కలెక్టర్ దృష్టికిగాని ఐజీ దృష్టికి గాని తీసుకురావాలి. పిఓబీ జాబితాలో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్‌లను గుడ్డిగా తిరస్కరించకుండా మూడు రోజుల సమయం తీసుకొని ఎందుకు తిరస్కరించవలసి వస్తుందన్న వివరాలను తెలియజేయాలి. పిఓబీకి సంబంధించి వచ్చిన ప్రతి దరఖాస్తును ఇకనుండి తహశీల్దార్‌కు పంపకుండా నేరుగా కలెక్టర్‌కే పంపించాలి. కలెక్టర్ నుండి డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ నుండి కలెక్టర్ మధ్యనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలి, గతంలో నాన్ అగ్రికల్చర్, అగ్రికల్చర్, పీఓబీ జాబితాలు వేర్వేరుగా ఉండేవి. వీటిని సమీకృతం చేయడం వలన సబ్ రిజిస్ట్రార్ పరిశీలనలో కొన్ని ఆస్తులు, నిషేధిత జాబితాలో ఉన్నట్లు కనిపిస్తున్నందున మొత్తం రిజిస్ట్రేషన్ ఆపుతున్నారని ఫిర్యాదుల వస్తున్నాయి. తాజాగా అప్‌లోడ్ చేస్తున్న సమాచారంతో సరిపోల్చుకొని నిర్ణయాలు తీసుకోవాలన్నారు. నాలుగు జిల్లాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ లతో సమావేశం నిర్వహించి ఉన్నత స్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వారికి తెలియజేసి తక్షణం అమలుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖ ఐ.జి. ని ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ సెక్రెటరీ డి.ఎస్. లోకేశ్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐ.జి. రాజీవ్ గాంధీ హనుమంత్, ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్ లు పాల్గొన్నారు.

# పార్లమెంట్ బయట పోటాపోటీ నిరసనలు..

**మొదటిపేజీ తరువాయి**

పార్లమెంట్ కార్యకలాపాలను అడ్డుకుంటోందని విమర్శించింది. మరోవైపు ఢిల్లీలో గత నెల విద్యార్థులపై పోలీసు చర్యపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో సమాధానం చెప్పాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది.

ఎన్డీయే ఎంపీలు రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని నినాదాలు చేశారు. అమిత్ షా సమాధానంపై చర్చకు రావాలని, పారిపోవద్దంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఝార్ఖండ్‌లో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేసినా రాహుల్ గాంధీ మౌనం వహిస్తున్నారని ఆరోపించారు. ఝార్ఖండ్ ప్రభుత్వంలో కాంగ్రెస్ భాగస్వామిగా ఉన్న విషయాన్ని ప్రస్తావించారు.మరోవైపు కాంగ్రెస్ ఎంపీలు అమిత్ షా సభకు రావాలంటూ నినాదాలు చేశారు. జులై 20న ఢిల్లీలో విద్యార్థుల నిరసనపై జరిగిన పోలీసు చర్యకు బాధ్యత ఎవరిదో హోంమంత్రి స్వయంగా వివరించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెబుతున్నా.. అమిత్ షా సభకు వచ్చి సమాధానం చెప్పాల్సిందేనని పట్టుబట్టారు.

ఝార్ఖండ్‌లో పరీక్షల్లో అవకతవకలను నిరసిస్తూ విద్యార్థులు రాంచీలో అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించారు. వారిని అడ్డుకునేందుకు పోలీసులు లాఠీలు, వాటర్ క్యానన్లు ప్రయోగించారు. దీనిపై రాహుల్ గాంధీ ఇప్పటికే స్పందించారు. విద్యార్థులపై బలప్రయోగం సరికాదని, శాంతియుత నిరసనకు వారికి హక్కు ఉందని అన్నారు. చర్చల ద్వారా సమస్య పరిష్కరించాలని ఝార్ఖండ్ ప్రభుత్వాన్ని కోరారు.

అయితే రాహుల్ గాంధీ విద్యార్థుల అంశాల్లో ఆచితూచి స్పందిస్తున్నారని బీజేపీ ఎంపీ దినేశ్ శర్మ ఆరోపించారు. ఝార్ఖండ్‌లో జరిగిన ఘటనపై ఆయన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ సంబిత్ పాత్రా కూడా ఇదే అంశాన్ని లేవనెత్తారు. విద్యార్థులపై లాఠీచార్జికి ఎవరు ఆదేశించారో చెప్పాలని ప్రశ్నించారు. మరోవైపు అమిత్ షా పార్లమెంట్‌లో ప్రకటన చేసేందుకు సిద్ధంగా ఉన్నారని ప్రభుత్వం స్పష్టం చేసింది. సభ సజావుగా జరిగేందుకు ప్రతిపక్షం సహకరించాలని కోరింది. అయినా ఇరు వర్గాలు తమ డిమాండ్లపై వెనక్కి తగ్గకపోవడంతో పార్లమెంట్‌లో ప్రతిష్టంభన కొనసాగుతోంది.

# 3.43 కోట్ల మందికి 'స్మార్ట్' ఆహార భద్రత

**హైదరాబాద్,ఆగస్టు 11(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో ఆహార భద్రతకు ఇక 'స్మార్ట్' రూపం రానుంది. రాష్ట్రవ్యాప్తంగా 3.43 కోట్ల మంది లబ్ధిదారులకు సంబంధించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి స్వాతంత్య దినోత్సవమైన ఆగస్టు 15న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈ పక్రియను లాంఛనంగా ప్రారంభించనుండగా, అదే రోజు రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఏర్పాట్లపై మంగళవారం పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ రోహిత్ సింగ్ తదితర ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తోనూ మాట్లాడి ముఖ్యమంత్రి పర్యటన, బహిరంగ సభ ఏర్పాట్లపై దిశానిర్దేశర చేశారు. ÷రాష్ట్రంలో ప్రస్తుతం 1,06,28,092 ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మంది లబ్ధిదారులు ఆహార

భద్రత పరిధిలో ఉన్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రతి అర్హుడైన లబ్ధిదారుడికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా ప్రభుత్వం అందిస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ప్రవేశంతో ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, సామర్థ్యం, లబ్ధిదారుల సౌలభ్యం మరింత పెరుగుతాయని చెప్పారు. 2025 జనవరి 26 నుంచి ఇప్పటి వరకు 16,32,810 కొత్త ఆహార భద్రత కార్డులను జారీ చేసి, వాటి ద్వారా 61,08,544 మంది లబ్ధిదారులకు ఆహార భద్రత కల్పించినట్లు మంత్రి వెల్లడించారు. ఆగస్టు 2026 నాటికి రాష్ట్రంలో మొత్తం ఆహార భద్రత కార్డుల సంఖ్య 1.06 కోట్లకు చేరిందన్నారు. తెలంగాణలో ఆహార భద్రత కార్యక్రమం ఏ స్థాయిలో కొనసాగుతోందో ఇందుకు ప్రభుత్వం చేస్తున్న వ్యయమే నిదర్శనమన్నారు. రేషన్ బియ్యం కోసం ఏటా సుమారు రూ.14 వేల కోట్లు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు మరో రూ.20 వేల కోట్ల వరకు ప్రభుత్వం వెచ్చిస్తోందని తెలిపారు. సంగారెడ్డి కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల తరలింపు, సీటింగ్, భద్రత, కార్డుల పంపిణీతో పాటు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని ముందుగానే పకడ్బందీగా ప్రణాళిక చేయాలన్నారు. కార్యక్రమానికి సంబంధించిన మినిట్-టు-మినిట్ షెడ్యూల్ సిద్ధం చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. మాజంలోని వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం వహించే వాస్తవ లబ్ధిదారులను గుర్తించి ముఖ్యమంత్రి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డులు అందించాలని చెప్పారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా కార్డుల పంపిణీలో లబ్ధిదారుల గుర్తింపును ధ్రువీకరించి, పూర్తి పారదర్శకతతో కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిగిలిన జిల్లాల్లో నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి కలెక్టర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు పంపాలని, అవసరమైన వ్యయంపై ముందుగానే స్పష్టత ఇవ్వాలని పౌర సరఫరాల శాఖ అధికారులకు సూచించారు. తెలంగాణలో 1.06 కోట్ల ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మంది ప్రజలకు ఆహార భద్రత కల్పిస్తున్నాం. ప్రతి అర్హుడికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం. ఇంత భారీ సంక్షేమ కార్యక్రమాన్ని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా లబ్ధిదారుడి చెంతకు తీసుకెళ్లడమే స్మార్ట్ రేషన్ కార్డుల లక్ష్యం' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆహార భద్రత కార్యక్రమం విస్తృతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 1.06 కోట్ల కార్డులు?3.43 కోట్ల లబ్ధిదారులు?ఉచిత సన్నబియ్యం వంటి కీలక అంశాలతో ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాతో పాటు షార్ట్ వీడియోలు, రీల్స్ ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి, సంగారెడ్డి రాష్ట్రస్థాయి కార్యక్రమంతో పాటు 33 జిల్లాల్లో జరిగే పంపిణీ కార్యక్రమాలను క్రమశిక్షణతో, పారదర్శకంగా, నిర్వహించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

# జనగణమన తరహాలో వందేమాతరం

## చట్టపరమైన రక్షణ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

**న్యూఢిల్లీ,ఆగస్టు 11(జర్నలిస్ట్ వార్త):**భారత జాతీయ గీతం 'జన గణ మన' తరహాలోనే 'వందేమాతరం'కు కూడా ఇకపై చట్టపరమైన రక్షణ లభించనుంది. 'ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ హానర్ బిల్లు'కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోదం తెలిపారు. దీంతో ఈ బిల్లు చట్టంగా మారింది. 1971 నాటి బిల్లులోని సెక్షన్ 3ను సవరించడం ద్వారా 'వందేమాతరం'ను కూడా చట్టం పరిధిలోకి తీసుకొచ్చారు. జాతీయ గీతాన్ని అడ్డుకోవడం లేదా దాని గౌరవాన్ని భంగపరిచేలా వ్యవహరించడంపై చట్టపరమైన చర్యలకు అవకాశం ఉంటుంది. అయితే అదే స్థాయిలో వందేమాతరానికి ఇప్పటివరకు ప్రత్యేక రక్షణ లేదు. తాజా సవరణ వందేమాతరానికి కూడా చట్ట పరమైన రక్షణ కల్పించింది. ÷రిత్త చట్టం ప్రకారం 'వందేమాతరం' గానం జరుగుతున్న సమయంలో ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా ఆ గానం చేస్తున్న సమూహానికి అంతరాయం కలిగించడం శిక్షార్హమైన నేరం. దీనికి మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది. వందేమాతరానికి చట్టపరమైన రక్షణ కల్పించే సవరణ బిల్లును పార్లమెంట్ గత నెలలో ఆమోదించింది. అనంతరం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించారు. రాష్ట్రపతి ముర్ము సంతకం చేయడంతో బిల్లు ఇప్పుడు అధికారిక చట్టంగా అమల్లోకి వచ్చింది.

# అంతర్జాతీయ దృష్టి ఆకర్శించేలా సమ్మిట్

**మొదటిపేజీ తరువాయి**

సదస్సు ద్వారా ప్రపంచస్థాయి పెట్టుబడులను తెలంగాణకు తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వివిధ వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులను సదస్సులో సత్కరించేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సంస్థాగత ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.

గత ఏడాది సదస్సు తర్వాత తెలంగాణకు వచ్చిన పెట్టుబడులు, వాటి పురోగతిపై వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని మరిన్ని పెట్టుబడులు సాధించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ఇదే సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 పనులపైనా సీఎం సమీక్షించారు. పాతబస్తీలో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మార్గంలో రోడ్డు విస్తరణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మెట్రో పనులకు టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. పెండింగ్ భూసేకరణను పూర్తి చేసి విస్తరణ ప్రణాళికలను ఖరారు చేయాలని చెప్పారు.హైదరాబాద్ మెట్రోలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు సమకూర్చుకోవాలని అధికారులను ఆదేశించారు. పాతబస్తీ మెట్రో మార్గంలో అనుసరించాల్సిన సాంకేతికతపై ఢిల్లీ మెట్రో అధికారులతో సంప్రదించాలని సూచించారు.

# 73 లక్షల ఓట్లు పోయినట్టే

**మొదటిపేజీ తరువాయి**

సమాచారంలో ఇప్పటి వరకు దాదాపు 2.64 కోట్ల ఫారాలను డిజిటలైజేషన్ పూర్తి చేయగా, నమోదు ప్రక్రియ 78.30 శాతానికి చేరింది. అయితే ఈ నమోదు సరళిని గమనిస్తే రాబోయే రోజుల్లో రాష్ట్ర ఓటర్ల జాబితా స్వరూపమే మారిపోనుందని స్పష్టమవుతోంది.

మరోవైపు, క్షేత్రస్థాయి పరిశీలనలో అధికారులకు సవాలుగా మారిన అనేక అంశాలు వెలుగుచూశాయి. మొత్తం 73.39 లక్షల ఎన్యూమరేషన్ ఫారాలను (21.70 శాతం) వివిధ కారణాల వల్ల సేకరించలేకపోయినట్లు అధికారులు 'అన్‌కలెక్టబుల్'గా వర్గీకరించారు. ఇందులో అత్యధికంగా 45.18 లక్షల మంది ఓటర్లు తమ నివాస ప్రాంతాల నుంచి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు గుర్తించగా, 9.22 లక్షల మంది ఓటర్లు మరణించినట్లు నమోదైంది. మరో 11.25 లక్షల మంది అసలు జాడ తెలక అడ్రస్ దొరకని స్థితిలో ఉండగా, 6.70 లక్షల మందికిపైగా ఇప్పటికే వేర్వేరు ప్రాంతాల్లో ఓటర్లుగా నమోదై ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఈ భారీ వ్యత్యాసాలు, వలసల గణాంకాల నేపథ్యంలో తుది ఓటర్ల జాబితా ప్రక్షాళనలో ఊహించని పెద్ద మార్పులు చోటుచేసుకోనున్నాయి.

# ఘోర రోడ్డు ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి**

మరో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. వీరంతా కర్ణాటకలోని బీదర్ జిల్లా రాజగిరికి చెందిన వ్యవసాయ కూలీలుగా గుర్తించారు. క్షతగాత్రులను జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం హుమనాబాద్ నుంచి జహీరాబాద్ వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.ప్రతిరోజు కూలి పని కోసం జహీరాబాద్ చుట్టు పక్కల ప్రాంతాలకు కూలీలు వస్తూ ఉంటారు. ఆటోలో మొత్తం 14 మంది ఉన్నట్లు సమాచారం. ఆయిల్ ట్యాంకర్ హైదరాబాద్ వైపు నుంచి కర్ణాటకకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులు కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాలోని రాజగిరికి చెందినవారిగా గుర్తించారు. సమాచారం అందగానే పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలోనే జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. కోహీర్ మండలం వెంకటాపూర్ కూడలి సమీపంలో 65వ నంబరు జాతీయ రహదారిపై ఓ కారు రోడ్డు డివైడర్ పైనుంచి అవతల వైపు ఎగిరి పడింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. నాలుగు వాహనాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

# త్వరలో రూ.10, రూ.20 ప్లాస్టిక్ నోట్లు..

**న్యూఢిల్లీ,ఆగస్టు 11(జర్నలిస్ట్ వార్త):**

దేశంలో త్వరలో పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లు చెలామణిలోకి రానున్నాయి. రూ.10, రూ.20 విలువ కలిగిన పాలిమర్ నోట్లను క్షేత్రస్థాయి ప్రయోగాల కోసం జారీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఒక్కో డినామినేషన్‌లో వంద కోట్ల చొప్పున నోట్లను ప్రయోగాత్మకంగా జారీ చేసే ప్రతిపాదనను ఆమోదించినట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేడు పార్లమెంటుకు వెల్లడించారు.భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సెంట్రల్ బోర్డు సిఫార్సు మేరకు 'ఆర్‌బీఐ చట్టం-1934'లోని సెక్షన్ 25 ప్రకారం ఈ ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపింది. ఈ క్షేత్రస్థాయి ప్రయోగాలు విజయవంతమైతే భవిష్యత్తులో ఈ రెండు విలువల్లోని పాలిమర్ నోట్లను క్రమబద్ధంగా జారీ చేసే అవకాశం ఉంటుంది. అయితే, ప్రస్తుతం చెలామణిలో ఉన్న కాగితపు నోట్ల స్థానంలో వీటిని తీసుకురావడం లేదని, వాటితో పాటే ఈ కొత్త నోట్లు కూడా అందుబాటులో ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.పాలిమర్ నోట్ల సేకరణ ప్రక్రియ ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని ఆర్‌బీఐ పేర్కొంది. అందువల్ల, వీటిని ఎప్పుడు ప్రవేశపెడతారు, దీనికి ఎంత ఖర్చవుతుంది అనే విషయాలపై ఇప్పుడే కచ్చితమైన వివరాలు చెప్పలేమని తెలిపింది. అంతర్జాతీయంగా చూస్తే, కాగితపు నోట్లతో పోలిస్తే పాలిమర్ నోట్లు ఎక్కువ కాలం మన్నుతాయి. ఈ ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

# ఏపీలో సోషల్ మీడియా కార్యకర్తలకు కూటమి పార్టీల హెచ్చరిక

**మొదటిపేజీ తరువాయి**

తప్పవని సంయుక్తంగా హెచ్చరించాయి. ఈ మేరకు 'ఎన్డీఏ సోషల్ మీడియా కోఆర్డినేషన్ కమిటీ' పేరుతో ఒక బహిరంగ ప్రకటనను విడుదల చేశాయి.గత కొంతకాలంగా కూటమి పార్టీల మద్దతుదారుల ముసుగులో కొన్ని నకిలీ ఖాతాలు సోషల్ మీడియాలో చురుగ్గా ఉన్నాయని, వీటి వెనుక వైసీపీ శ్రేణుల హస్తం ఉందని కూటమి నాయకత్వం గుర్తించింది. తెలుగుదేశం కార్యకర్తగా నటిస్తూ పవన్ కల్యాణ్‌పై, జనసేన అభిమాని ముసుగులో చంద్రబాబుపై విమర్శలు చేస్తూ విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ప్రకటనలో వివరించారు. ఇటువంటి చర్యల వల్ల అసలైన కార్యకర్తలు ఆవేశానికి లోనై ఒకరినొకరు విమర్శించుకుంటూ, తద్వారా కూటమి ఐక్యతకు విఘాతం కలిగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ తరహా కుట్రలను తిప్పికొట్టేందుకు అసలైన కార్యకర్తలు, అభిమానులు అత్యంత సంయమనం పాటించాలని మూడు పార్టీల నాయకత్వం కోరింది. సోషల్ మీడియాలో ఏవైనా అనుమానాస్పద పోస్టులు కనిపిస్తే, వెంటనే స్పందించకుండా సంబంధిత పార్టీల సమన్వయకర్తల దృష్టికి తీసుకురావాలని సూచించింది. ఇకపై మిత్రపక్షాలపై గానీ, నాయకులపై గానీ ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత దాడులు, మితిమీరిన విమర్శలు చేయరాదని స్పష్టం చేసింది.అంతర్గత విభేదాలకు తావివ్వకుండా కూటమి ఐక్యతను మరింత బలోపేతం చేయాలని పార్టీలు పిలుపునిచ్చాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యర్థులు చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశాయి. ప్రభుత్వ సానుకూల నిర్ణయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవాలని, కూటమి ఐక్యతే రాష్ట్ర ప్రగతికి మూలమని ఈ సందర్భంగా స్పష్టం చేశాయి.

జర్నలిస్ట్ వార్త

బుధవారం 12 ఆగస్టు 2026

# బీజేపీని గద్దె దించే వరకు పోరు

## ఢిల్లీ విద్యార్థుల పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి -సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి






**హనుమకొండ/బ్యూరోఆగస్టు 11 (జర్నలిస్ట్ వార్త):** దేశంలో బీజేపీ ప్రజావ్యతిరేక పాలనకు చరమగీతం పాడే వరకు సీపీఐ పోరాటం కొనసాగుతుందని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఢిల్లీ విద్యార్థుల పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు జిల్లాలో ఈ నెల 6న ప్రారంభమైన ప్రచార పాదయాత్ర మంగళవారం ముగిసింది. ముగింపు సందర్భంగా హనుమకొండలో భారీ ప్రదర్శన నిర్వహించారు. వెయ్యిస్తంభాల దేవాలయం నుంచి ప్రారంభమైన ప్రదర్శన హనుమకొండ చౌరస్తా మీదుగా పబ్లిక్ గార్డెన్ వరకు సాగింది. అనంతరం నిర్వహించిన సభలో పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడారు.

బీజేపీ 12 ఏళ్ల పాలనలో ప్రజలకు ఉపయోగపడే ఒక్క మంచి పని చేయలేదని విమర్శించారు. నిత్యావసర ధరలను నియంత్రించడంలో, యువతకు ఉద్యోగాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రైతులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంలో కేంద్రం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుకు నియోజకవర్గాల పునర్విభజనను ముడిపెట్టి అమలును ఆలస్యం చేస్తున్నారని అన్నారు. నీట్ పరీక్షల లీకేజీలతో లక్షలాది మంది విద్యార్థులు నష్టపోయారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తోందని ఆరోపించారు.

నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలని, విద్య, వైద్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవాలని, రైతుల పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించాలని, మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని, కార్మికుల హక్కులను హరిస్తున్న లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు.

**మహా ర్యాలీతో ముగింపు**

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు



6 నుంచి దేశవ్యాప్తంగా సీపీఐ పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలు, పట్టణాలు, గ్రామాల్లో పర్యటిస్తూ అట్టడుగు వర్గాల ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నామని చెప్పారు. సెప్టెంబర్ 1న ఢిల్లీలో నిర్వహించే మహా ర్యాలీతో కార్యక్రమం ముగుస్తుందని తెలిపారు.కార్యక్రమంలో సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, సీనియర్ నాయకులు టి.వెంకట్రాములు, సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేయకుంటే ఉద్యమం ఉధృతం

## తాండూర్‌వికారాబాద్ రోడ్డుపై వికలాంగుల బైఠాయింపు -కొడంగల్‌లో లక్ష మందితో ఆవేదన సభ: గిద్దె రాజేష్

**వికారాబాద్/ఆగస్టు 11 (జర్నలిస్ట్ వార్త):** వికలాంగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలోని తాండూర్‌వికారాబాద్ ప్రధాన రహదారిపై సంఘం నాయకులు, కార్యకర్తలతో కలిసి బైఠాయించారు.




ఈ సందర్భంగా గిద్దె రాజేష్ మాట్లాడుతూ వికలాంగుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో వికలాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచుతామని, ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని, వికలాంగులపై దాడుల నిరోధక చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని అన్నారు.

రూ.10 లక్షలతో 'వికలాంగుల బంధు' పథకాన్ని అమలు చేయాలని, ఆసరా పింఛన్ పొందుతున్న ప్రతి అర్హుడికి పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో వికలాంగులకు కేటాయింపులు పెంచి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేయాలని, నూతన ఆసరా పింఛన్లు వెంటనే విడుదల చేయాలని కోరారు.

ప్రభుత్వం హామీలను అమలు చేయకుంటే ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని గిద్దె రాజేష్ హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై రాష్ట్రవ్యాప్త దండయాత్ర చేపట్టి.. కొడంగల్‌లో లక్ష మందితో 'వికలాంగుల ఆవేదన సభ' నిర్వహిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నరసింహులు, జిల్లా అధ్యక్షుడు పసుల చంద్రయ్య, జిల్లా ఇన్‌చార్జి పోతురాజు సుధీర్, కడియ నరేష్, ఎం.చుక్కయ్య, లక్ష్మయ్య, బొంపల్లి ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, నారాయణ, జంగయ్య, యాదయ్య, జే.రాములు, మహిళా నాయకురాళ్లు లక్ష్మి, భాగ్యమ్మ, ఉరడి హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు అండగా ఆషా

## రూ.12 లక్షలతో విద్యా సామగ్రి పంపిణీ

**సత్తుపల్లి/ ఆగస్టు 11 (జర్నలిస్ వార్త):** విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సత్తుపల్లి పట్టణంలోని జేవీఆర్ డిగ్రీ కళాశాలలో విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పుస్తకాలు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు బ్యాగులు, డిగ్రీ విద్యార్థులకు పుస్తకాలు, కళాశాల యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. విద్యార్థులకు డాక్టర్ మట్టా దయానంద్ మోటివేషన్ క్లాస్





నిర్వహించి.. చదువుతోనే భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. మంచి నిర్ణయాలు తీసుకోవడం, క్రమశిక్షణ, నడవడిక, లక్ష్యసాధనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆషా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.12 లక్షల విలువైన సేవా కార్యక్రమాలు చేపట్టడంపై కలెక్టర్ దివాకర్ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ దంపతులను అభినందించారు. సత్తుపల్లి నియోజకవర్గంలో విద్యా వ్యవస్థ అభివృద్ధిపై ఎమ్మెల్యే దంపతులు చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడేలా సేవా కార్యక్రమాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమన్నారు.

# పరకాలకు సీఎం.. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

## ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ డిమాండ్

**హసన్‌పర్తి/ఆగస్టు 11 (జర్నలిస్ వార్త):** ఈ నెల 16న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరకాల పర్యటనకు వస్తున్న నేపథ్యంలో పట్టణంలో నెలకొన్న విద్యారంగ సమస్యలపై దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ పరకాల, ఆత్మకూర్ ప్రాంతాల్లో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు.పరకాలలో నర్సింగ్, మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయాలని, ఎస్సీ సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌కు స్థలం కేటాయించి నూతన భవనం నిర్మించాలని కోరారు.




ఆత్మకూర్ ఎస్సీ సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌కు కూడా స్థలం కేటాయించి భవనం నిర్మించాలన్నారు. పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరిపడా మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు నిర్మించి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కోరారు. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాలలకు నూతన భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఎం పర్యటన సందర్భంగా విద్యార్థుల సమస్యలపై స్పష్టమైన హామీ ఇవ్వడంతో పాటు పరిష్కారానికి అవసరమైన నిధులు కేటాయించాలని బొచ్చు కళ్యాణ్ డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి బొచ్చు ఈశ్వర్, పరకాల పట్టణ అధ్యక్షుడు బొజ్జ హేమంత్, జిల్లా కమిటీ సభ్యుడు సన్నీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల కార్యదర్శి రేవంత్, వినయ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి





**మిర్యాలగూడ/ ఆగస్టు 11 (జర్నలిస్ వార్త):**నియోజకవర్గంలోని పలువురు మృతుల కుటుంబాలను మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఆయా కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. తిప్పర్తి గ్రామంలో నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం వ్యక్తిగత సహాయకుడు ఉగ్గిది శ్రీనివాస్ తండ్రి ఉగ్గిది పెద్ద మల్లయ్య మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి వారి స్వగ్రామానికి వెళ్లారు. పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం మిర్యాలగూడ పట్టణంలోని నందిపాడు ప్రాంతంలో మాజీ కౌన్సిలర్ తూడి అశోక్‌రెడ్డి మృతిచెందడంతో ఆయన నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే పార్థివదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అదేవిధంగా సీతారాంపురం 43వ వార్డుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు షేక్ రషీదాబేగం మృతిచెందిన విషయం తెలుసుకుని ఆమె కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపి, ఈ కష్టకాలంలో వారికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ఆపదలో ఉన్న బాధిత కుటుంబాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్టూడెంట్ డైరీల పంపిణీ

## భీమారం ఉన్నత పాఠశాలలో 160 మందికి సొంత ఖర్చులతో అందజేత



**హసన్‌పర్తి/ఆగస్టు 11 (జర్నలిస్ వార్త):** విద్యార్థుల విద్యాభివృద్ధికి తనవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో భీమారం గ్రామానికి చెందిన కలవూరి పద్మ 160 మంది విద్యార్థులకు సొంత ఖర్చులతో స్టూడెంట్ డైరీలను పంపిణీ చేశారు. చింతగట్టు పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పద్మ మంగళవారం భీమారం ఉన్నత పాఠశాలలో



జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు డైరీలను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పద్మ మాట్లాడుతూ.. విద్యార్థులు డైరీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ ప్రతి పీరియడ్‌లో బోధించిన పాఠ్యాంశాలు, క్లాస్‌వర్క్, హోంవర్క్ వివరాలను డైరీలో నమోదు చేసుకోవాలని తెలిపారు. అనంతరం తల్లిదండ్రులకు చూపించి సంతకం తీసుకుని ఉపాధ్యాయులకు చూపించాలన్నారు. విద్యార్థులకు సేవ చేయడం ఎంతో సంతృప్తినిస్తుందని పద్మ పేర్కొన్నారు. డైరీలను కేవలం రికార్డు కోసం కాకుండా రోజువారీ చదువును క్రమబద్ధీకరించుకునేందుకు ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు ఏ. శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టి క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు సొంత ఖర్చులతో డైరీలు అందించిన కలవూరి పద్మకు పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయురాలు శ్రీదేవి, ఉపాధ్యాయులు చేరాలు శ్రీధర్, రాణి, సంయుక్త, దేవి, సరోజ, అంజనీదేవి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామస్థాయిలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

## పెంబర్తి గ్రామ కమిటీ నిర్మాణ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామిరెడ్డి







**హసన్‌పర్తి/ ఆగస్టు 11 (జర్నలిస్ వార్త):**గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామిరెడ్డి అన్నారు. హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ నిర్మాణ కార్యక్రమానికి మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. గ్రామాల్లో పార్టీకి బలమైన కమిటీలను ఏర్పాటు చేసి, ప్రతి కార్యకర్తను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ కమిటీల ఇన్‌చార్జి, మండల అధ్యక్షుడు ఈర్ల చిన్ని, మాజీ మండల అధ్యక్షుడు రేణుకుంట్ల అశోక్, ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ పోరెడ్డి మహేందర్‌రెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు తంగళ్లపల్లి తిరుపతి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొయ్యడ సునీల్, మండల మహిళా అధ్యక్షురాలు జోరుక పూల, మాజీ మండల యువజన నాయకుడు సౌరం చరణ్, సర్పంచ్ అభ్యర్థి తీగల తిరుపతి పాల్గొన్నారు.

గ్రామ కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు కొయ్యడ గణేశ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.7.50 కోట్ల ధాన్యం పక్కదారి?

## రైస్‌మిల్లు యజమానిపై కేసు నమోదు





**తల్లాడ/ఆగస్టు 11 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడలోని విజయదుర్గా రైస్ ఇండస్ట్రీ యజమాని బండారు నరసింహారావుపై పోలీసులు కేసు నమోదు చేశారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మిల్లులో నిర్వహించిన తనిఖీల్లో భారీగా ధాన్యం పక్కదారి పట్టినట్లు గుర్తించినట్లు సమాచారం. రికార్డుల ప్రకారం సుమారు రూ.7.50 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి పట్టినట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. విజిలెన్స్ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నరసింహారావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం. ఈ ఘటన నేపథ్యంలో తల్లాడలోని ఇతర రైస్‌మిల్లుల్లోనూ తనిఖీలు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

## సాతూరి వెంకన్న మాదిగకు ఘన సన్మానం

**ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నికపై హర్షం**



**ఎల్కతుర్తి/ ఆగస్టు 11 (జర్నలిస్ వార్త):** ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సాతూరి వెంకన్న మాదిగను మంగళవారం ఆయన స్వగృహంలో తోటి సహోదరులు మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.హనుమకొండ జిల్లా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు తూముల రాజ్‌కుమార్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల ఇన్‌చార్జి పెండ్యాల ఆనంద్‌పాల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకన్న మాదిగకు జాతీయ స్థాయిలో కీలక బాధ్యత దక్కడం మాదిగ సమాజానికి గర్వకారణమన్నారు. ఎమ్మార్పీఎస్ బలోపేతానికి మరింత కృషి చేసి, ఉద్యమాన్ని విస్తృతంగా ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

## మండలస్థాయి ప్రజావాణి నిర్వహణ

**జీవో విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం**




**హైదరాబాద్, ఆగస్టు 11(జర్నలిస్ట్ వార్త);**తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనుంది. ఈ మేరకు జీవో ఎంఎస్ నంబర్-4 ద్వారా ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజావాణిపై ఎంపీడీవోలకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించనుంది. ఆగస్టు 13వ తేదీన ఉదయం10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వారికి శిక్షణ ఇవ్వనుంది. హైదరాబాద్ ప్రజాభవన్‌లో ఈ శిక్షణ కార్యక్రమం జరగనుంది. మండల నోడల్ అధికారులైన ఎంపీడీవోలు తప్పనిసరిగా ఈ శిక్షణకు హాజరు కావాలని తెలంగాణ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది.

## మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం





**హసన్‌పర్తి/ఆగస్టు 11 (జర్నలిస్ వార్త):** మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మంగళవారం అరెపల్లిలోని వేకే గార్డెన్స్‌లో 3వ డివిజన్ మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని తెలిపారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గత ప్రభుత్వం పంపిణీ చేసిన బతుకమ్మ చీరల్లో నాణ్యత లోపించడంతో మహిళలు వాటిని వినియోగించలేకపోయారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నాణ్యమైన, ఉపయోగకరమైన చీరలను తయారు చేయించి అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు.కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అరుణ్‌కర్, మాజీ కార్పొరేటర్లు జన్ను అనిల్, శిభారాణి, సొసైటీ చైర్మన్ బుద్దే పెద్దన్న, సీనియర్ నాయకులు అభిషేకం, సంపత్, సుధాకర్, రవికుమార్, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# రైతులకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలి

**దేవాదుల నీటి నిర్వహణపై ఎమ్మెల్యేలు సమీక్ష**





**హసన్‌పర్తి/ఆగస్టు 11 (జర్నలిస్ వార్త):** దేవాదుల ప్రాజెక్టు నీటి నిర్వహణ, వినియోగంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రైతులకు సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశించారు. మంగళవారం హసన్‌పర్తి మండలం చింతగట్టులోని దేవాదుల ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో ప్రాజెక్టు నీటి నిర్వహణ, సరఫరాపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పరిధిలోని నీటి లభ్యత, రిజర్వాయర్లలో ఉన్న నీటి నిల్వలు, తాగునీటి అవసరాలు, పంపుహౌస్‌ల పనితీరు, కాలువల ద్వారా నీటి సరఫరా తదితర అంశాలపై ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యే సమగ్రంగా సమీక్షించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని సూచించారు.

**తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలి**

వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో పలు ప్రాంతాల్లో ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి ఎత్తిపోతల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా పంపుహౌస్‌ల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. రిజర్వాయర్లలోని నీటి నిల్వలను అవసరాలకు అనుగుణంగా వినియోగించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు.

**రైతులకు నీరందించాలి**

వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారని, ఈ నేపథ్యంలో కాలువల ద్వారా రైతులకు అవసరమైన నీటిని అందించాలని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యంగా పర్వతగిరి రిజర్వాయర్‌లో నీటిని విడుదల చేయడం ద్వారా పెద్ద సంఖ్యలో రైతులకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఆయకట్టు రైతులకు ఇబ్బందులు లేకుండా నీటి విడుదలపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను కోరారు. సౌత్ కెనాల్, లెఫ్ట్ కెనాల్ ద్వారా 15 రోజుల పాటు నిరంతరాయంగా నీటిని విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కాలువల చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా అధికారులు పర్యవేక్షించాలని, నీటి పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి విడుదలపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని అన్నారు.

**అధికారుల సమన్వయంతో ముందుకు**

దేవాదుల ప్రాజెక్టు ద్వారా సాగు, తాగునీటి అవసరాలు తీరుతున్నందున ప్రాజెక్టు నిర్వహణలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సూచించారు. పంపుహౌస్‌లలో సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని, నీటి ఎత్తిపోతలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు నీరు అందించే విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

సమావేశంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, యశస్వినిరెడ్డి, గండ్ర సత్యనారాయణరావుతో పాటు ఇరిగేషన్ శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, ఇంజనీర్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే రాగమయి జన్మదిన వేడుకలు






**తల్లాడ/ఆగస్టు 11 (జర్నలిస్ వార్త):** సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ జన్మదిన వేడుకలను తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం బిల్లుపాడులో ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే రాగమయి దయానంద్ ఆయురారోగ్యాలతో మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని నాయకులు ఆకాంక్షించారు.అనంతరం తల్లాడ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. బిల్లుపాడు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్‌లు, ప్యాడ్లు, పెన్నులు అందజేశారు.కార్యక్రమంలో తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, బిల్లుపాడు సర్పంచ్ ఎన్నిక కృష్ణవేణి, వైరా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, జక్కంపూడి కిషోర్, స్వామినేని రామ్ అప్పారావు, పొట్టేటి జనార్ధన్‌రెడ్డి, దీవెల కృష్ణయ్య, రమేష్, రాయల రాము, గోవిందు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళలు, యువకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## విద్యార్థులకు డైరీల పంపిణీ




**తల్లాడ/ఆగస్టు 11 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని బిల్లుపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు డైరీలు, పుస్తకాలను పంపిణీ చేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు జక్కంపూడి కిషోర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్‌కు కాంగ్రెస్ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి, సర్పంచ్ ఎన్నిక కృష్ణవేణి, వైరా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, ఉపాధ్యాయులు నరసింహారావు, సామినేని రామప్పారావు, జక్కంపూడి రమేష్, మాజీ ఎంపీటీసీ రాందాస్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫాదర్ జోజి జన్మదినం సందర్భంగా అన్నదానం



**మధిర/ఆగస్టు 11 (జర్నలిస్ వార్త):** ఫాదర్ గోరంట్ల జోజి జన్మదినం సందర్భంగా ఆయన సోదరుడు గోరంట్ల ప్రసాద్, కుటుంబ సభ్యులు మంగళవారం మధిరలోని మదర్ థెరిస్సా సేవాసదనం మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని మానసిక దివ్యాంగులకు అన్నం వడ్డించారు.ఫాదర్ గోరంట్ల జోజి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, దేవుని సేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా మానసిక దివ్యాంగుల పిల్లల తరపున ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

# చేతిలో సెల్‌ఫోన్.. చేతల్లో జ్ఞానం ఉండాలి

**యువత భవిష్యత్తును తీర్చిదిద్దేది సాంకేతికత కాదు.. దాని వినియోగమే**

సెల్‌ఫోన్.. నేటి మనిషి జీవితంలో విడదీయరాని భాగంగా మారిపోయింది. ముఖ్యంగా యువత జీవితంలో మొబైల్ ఫోన్‌కు ఉన్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. ఉదయం నిద్ర లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు ఫోన్ చేతిలో ఉండాల్సిందే. చదువు, ఉద్యోగం, సమాచార సేకరణ, వినోదం, స్నేహ సంబంధాలు.. ఇలా ప్రతి అవసరానికి సెల్‌ఫోన్ ఒక సాధనంగా మారింది. సాంకేతికత అభివృద్ధి చెందడం మంచిదే. కానీ ఆ సాంకేతికతను మనం ఎలా ఉపయోగిస్తున్నామన్నదే అసలు ప్రశ్న.ఒకప్పుడు యువత ఖాళీ సమయాన్ని పుస్తకాలు చదవడానికి, పెద్దలతో మాట్లాడడానికి, స్నేహితులతో చర్చించడానికి, క్రీడలు ఆడటానికి వినియోగించేది. ఇప్పుడు ఆ ఖాళీ సమయం మొత్తం మొబైల్ తెర ముందే గడిచిపోతోంది. ఒక వీడియో తర్వాత మరో వీడియో.. ఒక రీల్ తర్వాత మరో రీల్ ఇలా తెలియకుండానే గంటల సమయం గడిచిపోతోంది. ఈ అలవాటు యువత ఆలోచనా విధానంపైనా ప్రభావం చూపుతోంది.

సెల్‌ఫోన్ తప్పు కాదు. దాని వినియోగంలో విచక్షణ లేకపోవడమే సమస్య. అదే ఫోన్‌తో ప్రపంచంలోని గొప్ప పుస్తకాలను చదవొచ్చు. ఎన్నో విషయాలను నేర్చుకోవచ్చు. పోటీ పరీక్షలకు సిద్ధం కావచ్చు. ఉద్యోగ అవకాశాలను తెలుసుకోవచ్చు. కొత్త భాషలు, కొత్త నైపుణ్యాలు నేర్చుకోవచ్చు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవచ్చు. అంటే సెల్‌ఫోన్ ఒకవైపు వినోద సాధనం అయితే.. మరోవైపు జ్ఞానాన్ని అందించే విశాలమైన గ్రంథాలయం కూడా.

కానీ నేటి యువతలో కొంతమంది ఈ అవకాశాన్ని సరిగ్గా వినియోగించుకోవడం లేదు. సోషల్ మీడియా వ్యసనం, ఆన్‌లైన్ గేమ్స్, అవసరం లేని వీడియోలు, నిరంతర చాటింగ్ వంటి వాటితో విలువైన సమయాన్ని కోల్పోతున్నారు. ఇతరులు ఏం చేస్తున్నారు? ఎక్కడికి వెళ్లారు? ఏం తింటున్నారు? అనే విషయాలపై ఆసక్తి చూపుతూ.. తమ భవిష్యత్తు ఎలా ఉండాలి? తాము ఏం సాధించాలి? అనే విషయాలను మరిచిపోతున్నారు.

యువత ఒక్కసారి ఆలోచించాలి. రోజులో మనకు లభించే సమయం అందరికీ సమానమే. ధనవంతుడైనా,




పేదవాడైనా, చదువుకున్నవాడైనా, చదువుకోనివాడైనా రోజుకు 24 గంటలే. ఆ 24 గంటలను ఎలా వినియోగించుకున్నామన్నదే భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ఒక గంటను వృథా చేస్తే అది తిరిగి రాదు. అదే ఒక గంటను జ్ఞానం సంపాదించడానికి ఉపయోగిస్తే అది జీవితాంతం మనకు తోడుగా ఉంటుంది.

రాబోయే రోజుల్లో ప్రపంచం మరింత సాంకేతికత వైపు పయనించనుంది. కృత్రిమ మేధ, రోబోటిక్స్, ఆధునిక వైద్యం, అంతరిక్ష పరిశోధనలు, సైబర్ సాంకేతికత, డిజిటల్ సేవలు వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు రానున్నాయి. ఈ మార్పులను అందిపుచ్చుకోవాలంటే యువతకు కేవలం మొబైల్ వాడటం మాత్రమే కాదు.. జ్ఞానం, నైపుణ్యం, సృజనాత్మక ఆలోచన, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం అవసరం.

**యువతకు సెల్‌ఫోన్ బానిసత్వం కాదు.. జ్ఞాన సాధనం కావాలి.**

తల్లిదండ్రులు కూడా ఈ విషయంలో బాధ్యత తీసుకోవాలి. పిల్లలను కేవలం ఫోన్ చూడొద్దని మందలించడం కంటే.. ఫోన్‌ను ఎలా ఉపయోగించాలో నేర్పాలి. చదువు, విజ్ఞానం, ఉద్యోగ నైపుణ్యాలు, పోటీ పరీక్షలు, సృజనాత్మకత కోసం మొబైల్‌ను వినియోగించేలా ప్రోత్సహించాలి. ఇంట్లో పుస్తక పఠనానికి, క్రీడలకు, కుటుంబంతో గడిపే సమయానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

యువత కూడా తమకు తామే కొన్ని నియమాలు పెట్టుకోవాలి. అవసరం లేని సమయంలో ఫోన్‌కు దూరంగా ఉండాలి. సామాజిక మాధ్యమాలకు సమయ పరిమితి పెట్టుకోవాలి. రోజులో కొంత సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలి. కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలి. సమాజం, దేశం, ప్రపంచం గురించి తెలుసుకోవాలి.

ఎందుకంటే నేటి యువతే రేపటి దేశాన్ని నడిపించాలి. వారి చేతిలో ఉన్న శక్తి, వారి మెదడులో ఉన్న ఆలోచన, వారి కళ్లలో ఉన్న కలలు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తాయి. అందుకే యువత తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా భవిష్యత్తు నిర్మాణంపై దృష్టి పెట్టాలి.

సెల్‌ఫోన్‌ను వదిలేయాల్సిన అవసరం లేదు..

సెల్‌ఫోన్ బానిసత్వాన్ని వదిలేయాలి.

స్క్రీన్‌పై సమయాన్ని గడపడం కాదు..

జ్ఞానంపై సమయాన్ని పెట్టుబడిగా పెట్టాలి.

చేతిలో సెల్‌ఫోన్ ఉండటం గొప్ప విషయం కాదు. ఆ సెల్‌ఫోన్ ద్వారా ఎంత జ్ఞానం సంపాదించామన్నదే గొప్ప విషయం. మొబైల్ మన చేతిలో ఉండాలి.. మన భవిష్యత్తు మొబైల్ చేతిలో ఉండకూడదు.

యువత మేల్కొంటే కుటుంబం మారుతుంది. యువత ఆలోచిస్తే సమాజం మారుతుంది. యువత జ్ఞానాన్ని ఆయుధంగా చేసుకుంటే దేశం ముందుకు సాగుతుంది. అందుకే నేటి యువతకు కావాల్సింది మరింత స్క్రీన్ సమయం కాదు.. మరింత జ్ఞానం, మరింత ఆలోచన, మరింత లక్ష్యం.

సీనియర్ జర్నలిస్ట్
కొట్టే సుధాకర్
(లెనిన్)
టి యు డబ్ల్యూ జే
(హై జే యు) జిల్లా
కార్యవర్గ సభ్యులు
9908401581



## చిన్నారిని ఆశీర్వదించిన టీడీపీ నాయకులు



**పోలాకి/ఆగస్టు 11 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని తలసముద్రం గ్రామానికి చెందిన మాలుగు నీలం మాస్టారు కుమార్తె రజస్వల ఫంక్షన్ దేశవానిపేటలోని ఎస్ఎల్వీడీ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన చిన్నారిని ఆశీర్వదించారు.కార్యక్రమంలో రాష్ట్ర పొందర కూరాకుల కార్పొరేషన్ చైర్మన్ దామోదర నర్సింహులు, మండల పార్టీ అధ్యక్షుడు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, అడపా చంద్రశేఖర్, పోలాకి పీఏసీఎస్ చైర్మన్ ఖైరి భాస్కరరావు, మాజీ సర్పంచ్ ప్రతినిధి చిట్టి సింహాచలం, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు రావాడ గణపతిరావు, జల్లు రామారావు, చిట్టి వెంకటరమణ, దండుపాటి యర్రయ్య, ఖైరి సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

## పప్పుధాన్యాలను సాగు చేయాలని రైతులకు అవగాహన.





**బయ్యారం/,ఆగస్టు 11.(జర్నలిస్ట్ వార్త)**ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వరి పంటకు ప్రత్యామ్నాయంగా పప్పుధాన్యాల పంటలను సాగు చేయాలని రైతులకు మండల వ్యవసాయ అధికారి కే.రాజు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కొత్తపేట పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ అధ్యక్షతన బయ్యారం పెద్ద చెరువు ఆయకట్టు పరిధిలో వరి సాగు చేస్తున్న రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో నీటి లభ్యతపైన విస్తృతంగా చర్చించి,పంటల వైవిధ్యీకరణపై అధికారులు అవగాహన కల్పించారు.రైతులకు మెరుగైన ఆదాయం లభించేలా పెసర, మినుము,కంది తదితర పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా పెద్ద చెరువు నీటిని సమర్థవంతంగా వినియోగించుకుంటూ వరికి ప్రత్యామ్నాయంగా పప్పుధాన్యాలను సామూహికంగా సాగు చేయాలని రైతులను ప్రోత్సహించారు.అధికారుల సూచనలతో కొత్తపేట గ్రామానికి చెందిన రైతు పుల్లూరి బాలరాజు తన 2 ఎకరాల భూమిలో పెసర పంటను సాగు చేయడం ప్రారంభించి ఇతర రైతులకు కూడా ఆదర్శంగా నిలుస్తున్నారని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు,పలువురు రైతులు పాల్గొన్నారు.

# జెనోమ్ వ్యాలీలో 'యామ్జెన్' పరిశోధన కేంద్రం

### మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో ఎంఓయూ



**హైదరాబాద్,ఆగస్టు 11(జర్నలిస్ట్ వార్త):**

గ్లోబల్ దిగ్గజ బయోటెక్నాలజి సంస్థ 'యామ్జెన్' జెనోమ్ వ్యాలీలో అత్యాధునిక పరిశోధన, ఆవిష్కరణల కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. ఈ మేరకు మంగళవారం నాడు సచివాలయంలో ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ప్రభుత్వంతో ఎంఓయు చేసుకుంది. అంతకు ముందు శ్రీధర్ బాబుతో భేటీ అయిన యామ్జెన్ ఇండియా ప్రతినిధులు హైదరాబాద్ కేంద్రంగా తమ కార్యకలాపాల విస్తరణపై చర్చించారు. సమావేశానంతరం యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, తెలంగాణా ప్రభుత్వ పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్యలు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. జెనోమ్ వ్యాలీలో ఏర్పాటు చేస్తున్న ఈ పరిశోధన కేంద్రంలో స్థానిక ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వెల్లడించారు. యామ్జెన్ ఇటీవల 3 వేల మంది ఉద్యోగులతో అతి పెద్ద జిసిసి ని ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. ఔషధ రంగ దిగ్గజ కంపెనీలు తెలంగాణా పట్ల అపార విశ్వాసం కనబర్చడం తమ ప్రభుత్వానికి దక్కిన గౌరవమని ఆయన అన్నారు. లైఫ్ సైన్సెస్ కంపెనీలకు రాష్ట్రం ఒక ముఖ్యమైన వేదికగా మారడం పట్ల శ్రీధర్ బాబు సంతోషం వ్యక్తం చేసారు. ఉద్యోగ అవకాశాల్లో ఇక్కడి యువతకు ప్రాధాన్యతనిచ్చి నియామకాలు జరపాలని యామ్జెన్ యాజమాన్యానికి ఆయన సూచించారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, జీనోమ్ వ్యాలీ వంటి అభివృద్ధి చెందిన ఎకోసిస్టమ్ కారణంగా తెలంగాణ ప్రపంచ లైఫ్ సైన్సెస్ సంస్థలకు కీలక గమ్యస్థానంగా ఎదుగుతోందని ఆయన అన్నారు. దాదాపు 100 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న యామ్జెన్ క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఎముకల ఆరోగ్యం, ఇన్‌ఫ్లమేషన్, శ్వాసకోశ వ్యాధులు, అరుదైన వ్యాధులు తదితర తీవ్రమైన అనారోగ్య సమస్యలకు వినూత్న చికిత్సలను అభివృద్ధి చేస్తోంది. ఎంఓయు కార్యక్రమంలో పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, తెలంగాణా లైఫ్ సైన్సెస్ సిఇఓ సర్వేశ్ సింగ్, యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, ఇడి శ్రీను కొసరాజు, అనుమిత తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలి

**15-30 రోజుల వ్యవధిలో అన్ని జిల్లాల్లో మిల్లులు ప్రారంభించేలా చర్యలు**

**జిల్లా మానిటరింగ్ కమిటీలలో రైతులను భాగస్వాములను చేయాలి**

**కపాస్ కిసాన్ యాప్ లో స్లాట్ బుకింగ్ విధానాన్ని సరళీకృతం చేయాలి**

**రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సమన్వయంతో రైతులకు మేలు కలిగేలా చూడాలి**

**పత్తి రైతుల ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రత్యేక హెల్ప్ లైన్ నెంబర్లు**

**సీసీఐ అధికారులతో సమీక్షలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**హైదరాబాద్,ఆగస్టు 11(జర్నలిస్ట్ వార్త):**

రాష్ట్రంలో రానున్న 2026-27 పత్తి సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోళ్లు సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. పత్తి కొనుగోలు ఏర్పాట్లపై సీసీఐ అధికారులతో హైద్రాబాద్ లో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కష్టపడి పంట పండించిన రైతులకు మార్కెటింగ్‌లో ఎక్కడా ఇబ్బంది కలగకూడదని, ఒకరిద్దరి కారణంగా మొత్తం వ్యవస్థలకు చెడ్డపేరు రాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. 'మనం బతకాలంటే రైతు బతకాలి' అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని పనిచేయాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు వెళ్లి పత్తి రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. పంట కోతకు దాదాపు రెండు నెలల ముందుగానే పత్తి కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రకృతిపై ఆధారపడి పత్తి సాగు చేసే రైతులలో సన్న చిన్నకారు రైతులే అధికంగా ఉన్నందున, వారి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు ప్రక్రియను ముందుగానే పకడ్బందీగా సిద్ధం చేయాలని ఆదేశించారు. పత్తి కొనుగోలు ప్రక్రియలో మధ్యవర్తుల జోక్యానికి ఎలాంటి అవకాశం ఇవ్వకూడదని మంత్రి స్పష్టం చేశారు. రైతుల నుంచి నేరుగా, పారదర్శకంగా పత్తి కొనుగోలు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. గత సీజన్లలో పత్తి కొనుగోళ్లపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం గుర్తించిన అంశాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకుని, ఈ సీజన్‌లో అటువంటి లోపాలు, అవకతవకలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 2026-27 సీజన్‌లో రాష్ట్రంలో సుమారు 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతుందని, సుమారు 25.85 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అయ్యే అవకాశం ఉన్నట్టు అంచనా వేసినట్టు మంత్రి తెలిపారు. ఈ సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.8,667 కనీస మద్దతు ధర ప్రకటించిందని, గత ఏడాదితో పోలిస్తే రూ.557 పెరిగిందని చెప్పారు. ప్రతి అర్హత కలిగిన రైతుకు ప్రయోజనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, రైతులు మద్దతు ధర కంటే తక్కువ ధరకు పత్తిని విక్రయించే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రావద్దని ఆదేశించారు. రాష్ట్రంలోని 356 జిన్నింగ్ మిల్లులను నోట్గి÷ చేసి పత్తి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని కేటగిరీల మిల్లులను అవసరానికి అనుగుణంగా ఒకేసారి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత సీజన్‌లో 122 కొనుగోలు కేంద్రాలు ఉండగా, ఈ సీజన్‌లో వాటి సంఖ్యను 131 కేంద్రాలకు పెంచినట్లు మంత్రి తెలిపారు. అన్ని కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మార్కెట్ కు పత్తి రాక అధికంగా ఉండే ప్రాంతాల్లో అవసరమైన మేరకు అదనపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఒక ప్రాంతంలో జిన్నింగ్ మిల్లు అందుబాటులో లేకపోతే, సంబంధిత గ్రామాలు, మండలాలను సమీపంలోని నోటిఫైడ్ మిల్లుకు అనుసంధానం చేసి రైతులకు ఎక్కువ దూరం ప్రయాణించకుండా చూడాలన్నారు. ప్రతి జిల్లాలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని మంత్రి ఆదేశించారు. ఈ కమిటీల్లో రైతుల ప్రతినిధులను కూడా చేర్చుకోవాలని సూచించారు. మార్కెట్ యార్డులు, జిన్నింగ్ మిల్లుల వద్ద పత్తి రాకను క్రమబద్ధీకరించాలని, అవసరమైతే సాయంత్రం 6 గంటల తర్వాత కూడా కొనుగోలు సమయాన్ని స్థానిక కమిటీలు పరిస్థితులకు అనుగుణంగా పొడిగించాలని చెప్పారు. జిల్లాస్థాయి అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలను స్వయంగా పర్యవేక్షించి రైతులకు ఎదురవుతున్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని ఆదేశించారు. పాస్ కిసాన్ యాప్ లో స్లాట్స్ ఓపెన్ చేసే ముందు సంబంధిత జిల్లా కలెక్టర్, జిల్లా మార్కెటింగ్ అధికారులకు సమాచారం అందించి రైతులకు విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రి సూచించారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని మరింత సరళీకృతం చేసి, ఒక రైతు లేదా మొబైల్ నంబర్‌కు అవసరమైన విధంగా మల్టిపుట్ బార్ కోడ్ సౌకర్యం కల్పించాలని అన్నారు.

# సింగారంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన సర్పంచ్.



**బయ్యారం/,ఆగస్టు 11.(జర్నలిస్ట్ వార్త)**

బయ్యారం మండలం సింగారం గ్రామపంచాయతీలో ఎమ్మెల్యే కోరం కనకయ్య సహకారంతో 7.5 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ మంగళవారం శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజల అవసరాలను గుర్తించి, వెంటనే స్పందించి ఈ నిధులను మంజూరు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చుంచు మమత,వార్డు సభ్యులు చుంచు అనిల్ కుమార్, చెరుకుపల్లి మనీషా,గుగులోత్ బద్రు నాయక్,బానోత్ సరిత,సపవత్ అనిత, గ్రామ కార్యదర్శి బాధవత్ సరిత,మాజీ ఎంపిటిసి గంగావత్ గోపాల్ నాయక్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు చాట్ల వెంకన్న,చెరుకుపల్లి రవి,చుంచు వెంకటయ్య,గంగావత్ రాంకీ నాయక్, చుంచు సాయికిరణ్,గుగులోత్ వెంకటేష్,చుంచు సైదులు, సపవత్ సంతోష్,రవి,తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీల అభివృద్ధికీ నిధుల మంజూరు చెయ్యండి.

### -మంత్రికి వినతిపత్రం అందజేసిన సర్పంచ్ లు.





**బయ్యారం,ఆగస్టు 11.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండలంలోని జగ్గుతండ,నామాలపాడు,కాచనపల్లి గ్రామపంచాయతీల అభివృద్ధి పనుల కోసం వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరుతూ ములుగు క్యాంప్ ఆఫీస్ లో రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను మంగళవారం బయ్యారం మండల సర్పంచ్‌లు బొల్లి జయంతి వెంకటకృష్ణ,వర్స దీపిక ప్రకాష్ దొర,యాలం రేవతి మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు.గ్రామాల్లో మౌలిక వసతులు,కనీస సౌకర్యాలు,పెండింగ్ అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి తక్షణమే ప్రత్యేక నిధులను మంజూరు చేయాలని సర్పంచ్‌లు కోరారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని,నిధుల విడుదలకు,పెండింగ్ సమస్యలను పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీనిచ్చారు.ఈ కార్యక్రమంలో బయ్యారం మండల ఆదివాసి జేఏసీ మండల అధ్యక్షులు అలెం కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

### నల్లబెల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం




**వర్ధన్నపేట/ఆగస్టు 11 (జర్నలిస్ట్ వార్త):** బాలవికాస ఆధ్వర్యంలో లుమినస్ ఆసుపత్రి సారథ్యంలో నల్లబెల్లి గ్రామంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచి జక్కి అనిత శ్రీకాంత్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, వైరల్ జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి మేకల దేవేందర్, మాజీ ఉపసర్పంచి బిర్రు చంద్రయ్య, బాలవికాస ప్రతినిధులు పసునూరి స్వాతి, కొండేటి అశ్విత, అపర్ణ, వైద్యులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# కమలమ్మ మృతికి నాయకుల సంతాపం



**పర్వతగిరి/ ఆగస్టు 11(జర్నలిస్ట్ వార్త):** పర్వతగిరి వాస్తవ్యులు చిన్నపెల్లి దేవేందర్ తల్లి చిన్నపెల్లి కమలమ్మ మృతి చెందడంతో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు మంగళవారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి మాసాని గోపాల్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు ధర్మయ్య మాదిగ, డాక్టర్ శ్రీనివాస్ కమలమ్మ పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమలమ్మ మృతి కుటుంబానికి తీరని లోటని అన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని సూచించారు. అనంతరం దేవేందర్, కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో స్థానికులు, నాయకులు, బంధువులు పాల్గొన్నారు.

# దేశ ఐక్యతకు త్రివర్ణ పతాకం ప్రతీక



**వరంగల్/ఆగస్టు 11 (జర్నలిస్ట్ వార్త):**

దేశభక్తి, జాతీయ స్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు తమ కుటుంబ సభ్యులతో కలిసి స్వగృహంపై జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ త్రివర్ణ పతాకం దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు.